# చెల్లెలు

## * వాసమూర్తి *

వీరభద్రం ఇంట్లోకి అడుగు పెట్టేసరికి పిల్లలు ఎదురు పరుగెత్తుకు వచ్చారు. "అత్తయ్య వస్తోందిట, నాన్నా" అంటూ.

"ఏ అత్తయ్య?" అన్నాడు వీరభద్రం తెలబోతూ.

"దుర్గత్తయ్య, నాన్నా, రేపు సాయంత్రం వస్తోందిట" అంటూ వాళ్లలో వాళ్లు 'అత్తయ్య నాకు మిఠాయిలూ అవీ తెచ్చి పెడుతుంది.' నాకు 'ఆడుకుందుకు గుడ్డబొమ్మ తెస్తుంది,' నాకు 'కీ యివ్వగానే పరిగెత్తే రైలుబండీ తెస్తుంది, బలే బలే' అనుకుంటూ గంతులేస్తున్నారు పిల్లలు.

ఇంతలో తల్లి ఎదురు వచ్చింది. "దుర్గొస్తోందిటరా అబ్బాయి. రేపు పదిగంటల బండిలో వస్తున్నానని ఉత్తరం వ్రాసింది. అతనుకూడా వస్తున్నాట్ట. వంటి పిల్లాడికి మీనాన్న పేరే పెట్టారుట" అంటూ చెప్పుకుపోసాగింది ఆవిడ చెమర్చిన కళ్లతో.


వీరభద్రం ఏమీ మాట్లాడలేదు. లోపలికి నడిచి చొక్కా ఖండువా చిలుక కొయ్యకు తగిలించి కాళ్లు కడుక్కుందుకు దొడ్లోకి నడిచాడు. భార్య మహాలక్ష్మి చెంబుతో నీళ్లందిస్తూ "చెల్లెలుగారు వస్తున్నారట, ఉత్తరం చూశారా" అంది

వీరభద్రం గట్టిగా 'ఊఁహూఁ' అని మాత్రం అని మొగం కాళ్లు చేతులూ కడుక్కొని తువ్వాలుతో తుడుచుకుంటూ లోపలికి వచ్చాడు. భార్య కాఫీ తెచ్చి ఇచ్చింది. కాఫీ తాగి మళ్లా చొక్కా తొడుక్కొని వసారాలోకి వచ్చాడు. తండ్రి 'ఒరే అబ్బాయి' అని కేకేశారు. వీరభద్రం దగ్గరకు వెళ్లాడు. "ఒరేయి, అయిందేదో అయింది. రేపు అమ్మాయి వస్తే దానినేమీ అనకురా. మనమైనా దానిసుఖం కోసమే గదా ప్రయత్నించేది. మళ్లీ దాని మొగం చూడగలుగుతున్నాం, అదే చాలు," అంటూ ఉత్తరం తీసి "నువ్వే చదువు" అంటూ ఇయ్యబోయారు.

వీరభద్రం కనుబొమలు చిట్లించుకొని, "చదవక్కర్లేదు" అంటూ వీథిలోకి నడిచిపోయాడు. సాయంత్రం ఏడయ్యేటప్పటికి భోజనానికి తిరిగివచ్చాడు. పిల్లలప్పుడే భోజనాలు చేసేశారు. తల్లి, తండ్రీకూడా ఫలహారాలు తీసుకున్నారు. పిల్లలు తా-య్య, నాయనమ్మ దగ్గరా చేరి దుర్గత్తను గురించి ప్రశ్నలు అడుగుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు. "దుర్గత్తయ్య పాపాయిని నేనెత్తుకుంటాను" అంటోంది వీరభద్రం పెద్దకూతురు పూర్ణ. "కాదు నేనెత్తుకుంటాను" అంటున్నాడు పెద్దకుర్రాడు రాము. వీరభద్రం త్వరగా భోజనానికి వెళ్ళాడు. భోజనందగ్గర భార్య దుర్గ ప్రస్తావన తెచ్చింది. "ఈనాటికి అన్నగారు జ్ఞాపకం వచ్చారు కాబోలు. అదైనా తల్లీ తండ్రీ ఇక్కడ ఉన్నారు కాబట్టి. లేకపోతే అన్నగారి అవసరమేమిటి ఆవిడకి" అంటూ ఇంకా ఏదో మాట్లాడబోతూంటే వీరభద్రం గట్టిగా "హూఁ" అని కసిరాడు. మహాలక్ష్మి ఇంక మాట్లాడలేదు.

వీరభద్రం భోజనం చేసివచ్చి తన పడకగదిలో వాలుకుర్చీలో వాలి వారపత్రిక చదువుకుంటున్నాడు. మరికొంత సేపటికి భార్యవచ్చింది. పక్కా అవీ సర్ది భర్తదగ్గరకువచ్చి "ఇదుగో మీ నాన్నగారు మీ చెల్లెలి ఉత్తరం మీ కియ్యమన్నారు. తీసుకొని చదువుకోండి" అని ఉత్తరం అందియ్యబోయింది. "అక్కర్లేదు, అలా పడేయి" అన్నాడు వీరభద్రం విసురుగా. "ఉత్తరం చదివినంతలో ఏమి పోతుంది. మీ నాన్నగారు చెప్పారు కైనా చూడండి" అని చేతిలో పెట్టింది. వీరభద్రం కార్డు ఒక్కసారి చూసి బల్లమీద పడేద్దామనుకున్నాడు కాని చదవకుండా ఉండలేకపోయాడు. కార్డులో ఎక్కువ వకూడా వ్రాసిలేదు. దుర్గ తండ్రిపేర వ్రాసింది. "శ్రీ నాన్నగారికి అనేక నమస్కారాలు. అక్కడ అంతా క్షేమమే అనుకుంటాను. ఇక్కడ అంతా క్షేమం. మిమ్మల్నీ, అమ్మనీ, అన్నయ్యనీ, వదినినీ పిల్లల్నీ చూడాలని ఎంతో బెంగగా ఉంది. మా చిట్టిబాబుని మీ కందరికీ చూపాలని ఉంది. వాడికి మీ పేరే పెట్టాను. అప్పుడే బోర్లపడుతున్నాడు. మేము గురువారం పదిగంటల బండికి అక్కడికి వస్తున్నాం.








"ఎల్లప్పుడూ సకాలపు తాజాగా నుండునది" మిడ్‌లాండ్

Midland

మిడ్‌లాండ్ కోరిన ఇరువది-ఏడు రకముల పండ్లు, కాయగూరలు, జామ్‌లు, జ్యూస్‌లు, జెల్లీస్ ను సమకూర్చుచున్నది. డబ్బీలతో వచ్చే ఆహారములు ఇంత కంటె మంచివి లేవు.
దేశమంతట్లో చాలా గొప్ప కేవర్స్. వారు అత్యుత్తమమైనవి సేకరించ గలరు!

అది మిడ్‌లాండ్ దేనా అని చూచుకోండి

తయారు చేయువారు:
ది మిడ్‌లాండ్ ఫ్రూట్
అండ్ వెజిటబుల్ ప్రోడక్ట్స్
(ఇండియా) మధుర

సోల్ డిస్ట్రిబ్యూటర్లు:
కార్న్ ప్రోడక్ట్స్ కో.
(ఇండియా) ప్రైవేట్
లిమిటెడ్, బొంబాయి

భారత దేశమునకు ఏజెంట్లు: ప్యారి అండ్ కో. లిమిటెడ్.

# చెల్లెలు

అన్నయ్యాని స్టేషనుకి రమ్మనవలసింది. అమ్మకీ పిన్నయ్యకీ, వదినకీ నా నమస్కారాలు. ...ల్లలకి నా ఆశీర్వాదాలు. ఇట్లు మీకుమీ ... దుర్గ" అనిమాత్రం ఉంది. వీరభద్రం ఉత్తరం బల్లమీదికి విసిరేశాడు. ఏమీ విశేషం లేనట్లు వారపత్రికలో కథ చదువుదామనుకున్నాడు కాని మనస్సులో రెండేళ్ళనాటి క్రిందటి విషయం మెదులుతూ కలత పెడ్తోంది. మహాలక్ష్మి అంది: "మీకెంతో తలవంపులు తెచ్చింది! మీకెంత బాధ కలుగజేసింది. అదంతా ఏమీ లేనట్లు ఎంత అమాయకంగా రాసిందో చూశారా ఉత్తరం—" ఆమె ఇంకా మాట్లాడబోతూండగా వీరభద్రం తన ఆలోచనల్లో తాను సతమతమవుతూ ఆమె మాటలు వినడానికి ఓపిక లేక గట్టిగా విసుక్కున్నాడు. లేచి వారపత్రిక బల్లమీద పడేసి, మంచంమీద వాల్చిపడ్డాడు. భార్య మంచంమీదికి చేరి కాళ్ళు పిసకడం మొదలు పెట్టింది.

వీరభద్రం మనస్సు ఆ రెండేళ్ళ నాటి సంఘటన చుట్టూనే తిరుగుతూ అహంకారం అభిమానం రెచ్చగొట్టుతోంది. రెండేళ్ళ క్రిందట దుర్గకింకా పెళ్ళి కాలేదు. తండ్రి సంబంధాల కోసం తిరిగి తిరిగి ఏడుజతల చెప్పులు అరగ తీసుకున్నారు. ఒంట్లో అనారోగ్యం మూలంగా భారం తన ఒక్క కొడుకైన వీరభద్రంమీద వేశారు. వీరభద్రం తన బాధ్యత చక్కగా నిర్వర్తించి సుపుత్రుణ్ణనిపించుకోవాలనుకున్నాడు. మొదటి ప్రయత్నంలోనే ఒక ఇంజనీయరు సంబంధం దొరికింది. వాకబు చేయగా ఆ ఇంజనీయరు కుర్రవాడు తన బాల్యస్నేహితుడని తేలింది. ఇద్దరు స్నేహితులూ ఎంతో ఆనందంతో ఒకరి నొకరు కౌగలించుకున్నారు. బాల్య స్మృతులెన్నో జ్ఞప్తికి తెచ్చుకున్నారు. అదను చూసుకొని తను వచ్చినపని తెలియజేశాడు వీరభద్రం. మిత్రుడు ఆనందంతో అంగీకరించి తల్లిని తీసుకొని పిల్లను చూడడానికి వచ్చాడు. దుర్గను చూసి అన్ని విధాలా తృప్తి పడ్డారు వరుడూ తల్లీ. మిగతా విషయాలు మాట్లాడుకున్నారు. మిత్రుడివల్లనూ పైగా పిల్ల అందకత్తె కావడంవల్లను కట్నం ఐదువేలకు మించి అడగలేదు. ఒక్కతే చెల్లెలు కాబట్టి, అవతల ఇంజనీయరు కాబట్టి ఆమాత్రం కట్నం ఎక్కువ అనిపించలేదు వీరభద్రానికి, తల్లిదండ్రులకీ. కొల రోజుల్లో ముహూర్తం నిర్ణయించుకున్నారు. వీరభద్రం తన ఒక్కగా నొక్క చెల్లెలి పెళ్ళి చాలా బాగా జరపాలని ఉబలాటపడసాగాడు. తన మిత్రుడే తన బావగారు–ఇంజ

నీయరు జీవితంలో ఎంతమంచి ప్రారంభం! ఎంత గొప్ప హోదాలోకి వెళ్తాడో ఊహించుకుంటూ, ఇంత మంచి సంబంధం కుదిర్చినందుకు తన ప్రయోజకత్వానికి తానే పొంగిపోసాగాడు. కాని వారం రోజులు గడిచాయో లేదో ఒకరోజున దుర్గ ఇంట్లోనుంచి మాయమైంది. ఎక్కడికో వెళ్ళింది అలస్యమయింది కాబోలు ననుకున్నారు మొదట. ఎంతకీ రాకపోయేటప్పటికి కంగారుపడ్డారు. అంతటా వెతికారు. మర్నాడు మరో విషయం తెలిసింది. దుర్గ చదువుకున్న స్కూలులోనే ఒక పడుచు మాస్టరు కూడా అకస్మాత్తుగా మాయమయ్యాడని. ఒక పెద్దమనిషి చివరికి ధృవపరచనే పరిచాడు. తాను వారిద్దరినీ రైలెక్కుతుండగా చూశానని. వీరభద్రం వంచిన తలఎత్తనే లేకపోయాడు. కన్నీళ్ళతో తనమిత్రుణ్ణి క్షమాభిక్షకోరాడు. ఇంజనీయరు మిత్రుడు ఆశించని ఔదార్యం చూపాడు." మాదే పొరబాటయింది. మాకు పిల్ల నచ్చిందా లేదా చూశాము కాని పిల్లకు నేను నచ్చానా లేదా అన్నది ఎవరుపట్టించుకోలేదు. నువ్వేమీ బాధపడకు. వీరభద్రం నువ్వు నాకు ఎప్పుడూ స్నేహితుడిగానే ఉంటావు అన్నాడు వీరభద్రం భుజం తట్టుతూ. వీరభద్రం మాత్రం అవమానంతో కుమిలిపోయాడు. మిత్రుడి ఔదార్యం తన చెల్లెలి పనిపట్ల మరింత ఘృణపెంచింది. మరో మూడునెలలకు కలకత్తానుంచి ఉత్తరం వచ్చింది. దుర్గదగ్గరనుంచే. తమను క్షమించమని. తాము రిజిష్టరు మారేజి చేసుకున్నామని, తనభర్త కలకత్తాలో ఒక కంపెనీలో గుమాస్తాగాపనిచేస్తున్నాడనీ, తాముసుఖంగా ఉన్నామనీ అందరి క్షేమసమాచారాలతో వెంటనే ఉత్తరం వ్రాయమనీ వ్రాసింది. జవాబు వ్రాయవీలులేదని శాసించాడు తండ్రిని వీరభద్రం. 'ఆమనిషి' ప్రస్తావన ఇంక ఎన్నడూ ఇంట్లో తేకూడదని గట్టిగా చెప్పాడు. అలాగే నడుచుకున్నారు ఇంట్లో వారంతా. కడుపులో ఏమిబెంగ వేధించినా పైకి ఏమీ అనలేదు తల్లిదండ్రులు. మళ్ళీ ఉత్తరంలేదు దుర్గనుంచి. ఈ రెండేళ్ళూ తనకు చెల్లెలున్నమాటే మరచిపోయాడు వీరభద్రం. మళ్ళీ ఈవేళ ఈఉత్తరం. రెండేళ్ళనాడు తాను పడ్డ అవమానం, క్షోభా తిరిగి ప్రజ్వరిల్లాయి. అదే తలచుకుంటూ ఆగ్రహంలో నిండిపోతున్నాడు. కాని ఆరెండేళ్ళకుముందు తన చెల్లెలితో గడిపినరోజుల వైపుకు పోలేకపోతున్నాడు.

కాళ్లు పిసుకుతూ కొంతసేపటికి మహాలక్ష్మి అంది. 'ఎలాగూ రానే వస్తోంది. మనమెందుకు మర్యాదగానే చూడండి. నలుగురూ నాలుగుమాటలూ అంటారు. ఆనాడు ఆవిడ లేచిపోతే మనల్ని హేళన చేసిందివీళ్ళే. ఈనాడు ఆవిడకు మర్యాద చేయకపోతే మళ్ళీ ఆడిపోసుకునేది వీళ్లే. మీరు [illegible] మీరు ఏమీ తెలియనట్లే నటించండి."

"నీసలహా నాకక్కర్లేదు" అన్నాడు వీరభద్రం లోపలిఆగ్రహంతో ఉడికిపోతూ.

"నాసలహా మీ కెప్పుడూ అక్కర్లేదని తెలుసులెండి. కాని ఏంచేసినా మిమ్మల్ని ఎవరూ ఏమీ అనరు. నన్నే అంటారు. నేనే ఏదో చెప్పిపెట్టానని, నావల్లే మీరలా చేశారని" అంది భార్య.

మర్నాడు ప్రొద్దున్న తండ్రి కొడుకు ముందు మళ్ళీ కదిపాడు "ఏరా అబ్బాయి స్టేషను కెళ్తావురా?" అని అడిగారు.

'ఎందుకు?' అనేశాడు వీరభద్రం.

"ఎందుకేమిటిరా. చెల్లాయిని తీసుకురావడానికి. నిన్నే రమ్మనివ్రాసింది."

వీరభద్రం మాట్లాడలేదు.

"అబ్బాయి, గడిచిందేదో గడిచిపోయిందిరా. ఇంకా ఆ అభిమానాలు పెట్టుకుంటే ఎలాగురా. ఒక్కతేఅది. చెల్లెలయినా తమ్ముడైనా అదే. ఎంతఇదయినా పేగుసంబంధం ఎక్కడికిపోతుందిరా. కాస్త వెళ్ళిరారా" అన్నారు ఆయన.

"ఏమో చూస్తాను" అని కదిలిపోయాడు వీరభద్రం అక్కడినుంచి.

అతను వెళ్ళడని తెలుసు కాబట్టి తండ్రి గౌరీనాథంగారే మనుమల్ని వెంటబెట్టుకొని స్టేషనుకు వెళ్లారు. నిజానికి వీరభద్రం కొంతదూరం పోయిన తరువాత స్టేషనువైపుకు నాలుగడుగులు వేశాడు కానీ మళ్ళీ ఆలోచన రాగా చటుక్కున ఆగిపోయి ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

రైలుఆగకుండానే కిటికీలోనుంచి కేకేసింది దుర్గ "నాన్నా, నాన్నా, ఇక్కడ, ఇక్కడ" అంటూ. గౌరీనాథంగారు పిల్లలూ అటు పరుగెత్తారు. దుర్గ ముందుదిగివచ్చింది చేతిలో చంటిపిల్లవాడితో "ఇదుగో చూడు నాన్నా, నీ మనుమడు. నీ పేరుపెట్టాము" అంటూ కొడుకుని తండ్రికి చూపించింది. కూతుర్ని మనుమడిని చూసి పొంగిపోయారు గౌరీనాథంగారు. "నాన్నా నువ్వేవచ్చావేం. అన్నయ్య ఏడీ, నీ ఒంట్లో బాగుంటోందా?" అని అడిగింది దుర్గ. "ఆ ఏమి బాగుండడమమ్మా. అలాగే కాలక్షేపం చేస్తున్నాను. అన్నయ్య ఆఫీసుకు తొందరగా వెళ్ళవలసివచ్చిందట. అందువల్ల రాలేకపోయాడు" అన్నాడు గౌరీనాథంగారు. ఇంతలో సామాను కూలీలచేత దింపించుకొని ఒక పడుచువాడు గౌరీనాథంగారి దగ్గరికి వచ్చి "నమస్కారమండీ మామగారు. అంతా కులాసాగా ఉన్నారా?" అన్నాడు. తన పేరు మోహనరావు అని కూడా చెప్పుకున్నాడు. గౌరీనాథంగారు మొదట్లో తెల్లబోయారు కాని తరువాత "అంతాకులాసాయే, నాయనా, పదండి త్వరగా ఇంటికిపోదాం" అని స్టేషనుబయటికి నడిచి ఇంటికి చేరారు.

బండి ఆగగానే దుర్గతల్లి పరుగెత్తుకువచ్చి కూతురిని కౌగలించుకొని ఏడ్చింది. "ఎన్నాళ్ళకు కనిపించావే తల్లీ' అంటూ. వదినగారు ఎదురకువచ్చి దుర్గను పలుకరించి పిల్లవాడికీ తల్లికీ దిష్టితీసి లోపలకు తీసుకువెళ్ళింది. లోపలకువెళ్ళగానే దుర్గ ముందు పెట్టెతీసి అన్నపిల్లలకు తాముతెచ్చిన బొమ్మలూ, బిస్కట్ల పొట్లాలూ ఇచ్చింది. వాళ్ల సంబరానికి అంతే లేకపోయింది. పెద్దవాళ్ళందరూ కబుర్లలో మునిగిపోయారు. దుర్గ కలకత్తా విశేషాలెన్నో చెపుతోంది. వదినగారు కూడా వింటోంది. ఎవరూ వెనకటి సంఘటనగురించి పొరబాటునైనా మాట్లాడడంలేదు. మామూలుగా కూతురు అత్తవారింటినుంచి వచ్చినట్లే ఉంటున్నారు.

సాయంత్రంఅవుతోంది. దుర్గ వదినగారిని తన అన్నయ్యను గురించి అడుగుతోంది. "అన్నయ్య ఎప్పుడొస్తాడు. వదినా? ఇప్పుడు జీతం ఏమైనా పెరిగిందా? "అంటూ" ఎన్నో ప్రశ్నలు వేస్తోంది, వీధిగుమ్మం దగ్గరకు వెళ్ళి చూస్తోంది.

సాయంత్రం ఐదు దాటింది. వీరభద్రం వచ్చాడు. తండ్రినిచూసి పిల్లలు ఎదరకుపరుగెత్తివచ్చారు. కాని వాళ్ళకుముందే దుర్గ పరుగెత్తుకువచ్చింది— "కులాసాగా ఉన్నావా అన్నయ్యా" అంటూ నవ్వుతూ. వీరభద్రం ఒక్కసారి నిలబడిపోయి ఏమి మాట్లాడాలో తెలియక 'ఆ' అనిఊరుకున్నాడు. ఇంతలో పిల్లలు "నాన్నా అత్తయ్య మాకివన్నీ తెచ్చింది" అంటూ చూపిస్తూ గంతులు వేస్తున్నారు. వీరభద్రం మొగంమీద చిరునవ్వు లేకుండానే లోపలకు నడిచాడు. "కులాసాగాఉన్నారా బావగారు" అంటూ మోహనరావు నమస్కారం పెట్టాడు. అతనిని చూసేసరికి వీరభద్రానికి మండుకు వచ్చింది. "ఈమనిషా తనబావగారు. చెల్లెలిని లేవతీసుకొని రిజిష్టరుమారేజి చేసుకున్నవాడు!" వీరభద్రం మొగం ముడుచుకొని లోపలకు వెళ్ళిపోయాడు. అన్న సరదాగా పలకరించకపోవడంచూసి దుర్గ మనస్సు చివుక్కుమంది.

(61-వ పేజీ చూడండి)

క్లాసులో ఉపాధ్యాయుడు శకుంతలా-దుష్యంతుల పాఠం ముగించి "బాబు శకుంతల ఎవర్రా?

బాబు: (తడుముకోకుండా) మా అన్నయ్యకు రోజూ ఉత్తరాలు ఇచ్చిరమ్మనే శకుంతలే నాండి!

'మకరం', హైదరాబాదు

కాని ఎలాగైనా అన్నగారిచేత మాట్లాడించాలని పట్టుదల పెరిగింది ఆమెకు.

వీరభద్రం కాళ్లు చేతులూ కడుక్కొని లోపలకువచ్చి కాఫీ తీసుకుంటుండగా దుర్గ చెప్పింది. "అన్నయ్యా నీకోసం తెచ్చాం చూడు తోలుసూట్‌కేసూ, బ్రీఫ్‌కేసూ చాలా మంచివి. బెనారస్‌వాళ్ళ షాపులో కొంత చౌకగానే వచ్చాయి" అంటూ అవి అన్నగారిముందు పెట్టింది. మహాలక్ష్మి భర్తకేసి చూసోంది. వీరభద్రం మౌనంగానే ఆత్రంలో వస్తువులు పట్టుకొని చూశాడు. దుర్గ వెనకాల కొద్దిదూరంలో మోహనరావు నిలబడి ఉన్నాడు. బావగారు ఏమైనా అడిగితే కలుగజేసుకొని ఎలాగో మాట్లాడదామని ఎదురుచూస్తూ. మోహనరావును చూసి వీరభద్రం 'సరే' అని మాత్రం అని అవి పక్కబల్లమీద పెట్టేశాడు. సమయానికి దుర్గ పిల్లవాడు కేరుకేరు మన్నాడు. దుర్గ అక్కడినుంచి పరుగెత్తింది. మోహనరావు అంతకుముందే వెళ్లిపోయాడు. మహాలక్ష్మి భర్తకేసి సార్థంగా చూసింది. వీరభద్రం భార్యకేసి కోపంగాచూసి తల తిప్పేసుకున్నాడు.

భోజనం చేసిన తరువాత వీరభద్రం పడక కుర్చీలో వాలాడు. దుర్గ అన్నయ్యకు పిల్లవాడిని చూపిస్తానని తీసుకువచ్చి అన్నగారి చేతిలో పెట్టింది. "వాడినిచూడు అన్నయ్యా వీడు నీపోలికేకాదూ. అందరూ నీపోలికే అంటున్నారు" అంది నవ్వుతూ. తల్లి కూతురి దగ్గర నిలబడి మనుమడినిచూస్తూ "నీ పోలికేరా" అంది. మోహనరావు గుమ్మందగ్గర తచ్చాడుతున్నాడు. వీరభద్రం చేతిలో పిల్లవాడు 'ఊ ఊ' అంటూ బోసినవ్వు నవ్వుతున్నాడు. మధ్య మధ్య రెండుచేతులవేళ్లు నోట్లో కుక్కుకోబోతున్నాడు. వీరభద్రం పిలవంచుకొని పిల్లవాడిని చూస్తున్నాడు. పిల్లవాడు చాలా ముద్దుగా ఉన్నాడు. పైకి ఎత్తి ముద్దుపెట్టుకోబోయాడు వీరభద్రం కాని అంతలోవాడు ఆ తచ్చాడుతున్న మనిషి కొడుకని గుర్తువచ్చి ఆగిపోయాడు. పిల్లవాడు బట్ట తడుపసాగాడు గబుక్కున పైకెత్తాడు వీరభద్రం వాడిని. దుర్గ అది చూసి అరి 'వెధవా మామయ్యకిదా బహుమానం ఇచ్చేది" అంటూ నవ్వుతూ పిల్లవాడిని ఎత్తుకొని తీసుకుపోయింది. తరువాత తల్లి అంది "అబ్బాయి, వాడికి ఏమైనా చేయిస్తే బాగుంటుందనుకుంటున్నామురా. ఏంచేస్తే బాగుంటుందంటావు?" వీరభద్రానికి కోపంవచ్చింది. అయినా భార్య తనకేసిచూస్తూ ఉండడం గమనించి "ఏమోనాకు తెలియదు. డబ్బిమ్మంటే ఇస్తాను" అన్నాడు. ఇష్టంలేకపోయినా ఈ మర్యాదలన్నీ పాటించవలసి వచ్చినందుకు రోషంతో.

మోహనరావు భార్యతో అన్నాడు. "నాకిక్కడ ఏమీ బాగుండలేదు. మీ అన్న

# చెల్లెలు

(39-వ పేజీ తరువాయి)

య్యకు మనమీద చాలా కోపంగా ఉంది. అలాంటప్పుడు ఇక్కడ ఉండడం ఏంబాగుంటుంది. మనం రేపే వెళ్లిపోదాం. ఒకసారి మీఅమ్మగార్నీ అన్నగార్నీ అక్కడికే రమ్మన వచ్చు".

"కాదులెండి. మా అన్నయ్య చాలా మంచివాడు. వాడు తెలియదేమిటో, ఇప్పుడు కోపం మూలాన అలా ఉన్నాడు. మీరు మాట్లాడుతూ ఉండండి. రెండు రోజులకు తనే మాట్లాడుతాడు" అంది దుర్గ.

అలాగే భార్య సలహా ప్రకారం మర్నాడు ప్రొద్దున్న వీరభద్రం వాకిట్లో కూర్చొని పేపరు చదువుతుంటూండగా మోహనరావు పక్క కుర్చీ మీదికి చేరి, కొంతసేపుండి ఏమి మాట్లాడితే బాగుంటుందో తెలియక చివరికి "మీరు ఏ కవటి ఆఫీసరేనా?" అని అడిగాడు. 'ఊఁ' అన్నాడు వీరభద్ర పేపరులోనుంచి తల తీయకుండా. "మీకేమైనా ప్రమోషన్ వచ్చిందా?" రెండో ప్రశ్న. 'లేద'ని పొడి జవాబు. "ఈ వేళ పేపరు విశేషాలేమిటి?" అన్నాడు మోహనరావుసామాన్యంగా రాజకీయాలు మాట్లాడని తెలుగువాడుండడని. వీరభద్రం పేపరు అతని కందిచ్చి ఏదో దీర్ఘాలోచనలో మునిగిపోయాడు.

ఆపూట భోజనంలో రెండు పిండివంటలున్నాయి. రెండూ కొత్తవే. చాలా రుచిగా ఉన్నాయి. వీరభద్రం మళ్ళీ వేయించుకున్నాడు. "ఈ పిండివంటలు ఎలా వచ్చాయి? ఎవరు చేశారు అని అడగరేం?" అంది భార్య. "ఎలాఉన్నాయి అన్నయ్యా. నేనే చేశాను. బెంగాలీ వంటలు" అంది దుర్గ. "బాగానే ఉన్నాయి" అని తరువాత వంచిన తల ఎత్తకుండా భోజనం చేశాడు వీరభద్రం. అతను ఆఫీసుకు వెళ్తూంటే "అన్నయ్యా ఈ వేళ పెందరాళే ఇంటికిరా. అందరం సినిమాకువెళ్దాం" అంది దుర్గ. వీరభద్రం మాట్లాడకుండానే వెళ్లిపోయాడు.

సాయంత్రం ఆలస్యంగానే వచ్చాడు. ఆఫీసులో ఒక వార్త విన్నప్పటినుంచి అతనిలో చెల్లెలిపట్ల ఇంకా కోపం పొంగింది. తన ఇంజనీయరు మిత్రుడికి ఒక శాసన సభ్యుడు తన కూతురినిచ్చి వివాహం చేయబోతున్నాడనీ, పెళ్ళి అయిన వెంటనే స్కాలర్‌షిప్పు మూలంగా ఇంగ్లండులో ఉన్నత విద్య నభ్యసించడానికి వెళ్తాడని తెలిసింది. 'ఆమెకు ఇంజనీయరు భార్యగాకన్న కంపెనీ గుమాస్తాభార్యగా ఉండటం గొప్ప అనిపించింది కాబోలు!' వీరభద్రం ఇంట్లోకి అడుగు పెట్టాంటేనే దుర్గ ఎదురువచ్చి అడిగింది "అన్నయ్యా! ఇంత ఆలస్యం చేశావేం. నీ నిమిత్తం ఎదురుచూస్తున్నాము. అమ్మావాళ్లుకూడా వస్తారు. త్వరగా భోంచెయ్యి. సినిమాకు వెళదాం," అంది. వీరభద్రానికి ఈ సారి నాలుగుమాటలు మాట్లాడక తప్పిందికాదు. "నాకు ఖాళీలేదు. ఎవరో కలుసుకోవాలి" అన్నాడు. భర్త రాకపోతే తానూ రానంది మహాలక్ష్మి. దుర్గ అన్నగారిని బలవంతంచేసింది: "నువ్వు రాకపోతే వదినకూడా రానంటోంది. అందరంకలిసి సరదాగా వెళ్దాం అన్నయ్యా. అమ్మ వాళ్ళుకూడా ముచ్చట పడుతున్నారు." చివరికి వీరభద్రంకూడా సినిమాకు వెళ్లాడు—అలా వెళ్ళవలసి వచ్చినందుకు లోపల మరింత రెచ్చిపోతూ. తనే అందరికీ టికెట్లు కొన్నాడు—మొదటితరగతి టికెట్లు. అంతా ఒకచోటే కూర్చున్నారు. వీరభద్రం మాత్రం సినిమాని ఆనందించలేకపోయాడు. దుర్గా మోహనరావూ నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ చూస్తున్నారు. వాళ్లకేసి చూసి వీరభద్రం అసహ్యించుకున్నాడు—వాళ్లేదో అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు.

మోహనరావు బావగారితో మాట్లాడడానికి మళ్లీ ప్రయత్నించలేదు. వీరభద్రాన్ని చూస్తూంటే అతని కదోరకం బెదురుగావుంది. అందువల్ల దూరంగా తప్పుకు తిరుగుతున్నాడు. కాని దుర్గమాత్రం అన్నగారిని విడిచిపెట్టడంలేదు. వదినగారి కడుపడి తనే అన్నకు కావలసినపనులన్నీ చేస్తోంది. నీళ్లూ అవీ తనే అందిస్తోంది. కాఫీ తనే కాచియిస్తోంది. రోజూ టిఫిన్‌కూడా చేసిపెడ్తోంది. అయినా ఎన్నివిధాల తంటాలు పడినా అన్నగారిచేత రెండు మాటలను


## ఫత్తు పుస్తకాలకై 84 మైళ్ల ప్రయాణం

గడువు దాటితే ఆశాభంగమవుతుందని ఒక ఆసామీ జూన్ 6 వ తేదీనాడు రూ. 4 ఖర్చుపెట్టి, కేవలం ప్రణాళికకు చందాకట్టే పనిమీద 42 మైళ్ళు ప్రయాణం చేశాడు. సకాలంలో చందాకట్టి మహా సంతోషంతో మళ్ళీ 42 మైళ్ళు వెళ్ళి ఇల్లుచేరాడు.

అంత కష్టపడి మైళ్ళకు మైళ్ళు ప్రయాణం చేయకుండానే మీరు ఎలా చందాదారులు కావచ్చో. 32 & 33 పేజీలోని వివరాలు చదవండి. మంచిపని చేశామని మీరే సంతోషిస్తారు.

# చెల్లెలు

మించి మాట్లాడించలేకపోతోంది. చెల్లెలు ఇలా అడుపడి పనులు చేస్తూండడంవల్ల వీరభద్రం ఇరకాటంలో పడ్డాడు. ఏమీ అననూ లేకపోతున్నాడు. కాని లోపల పట్టుదల మాత్రం పిసమైనా సడలలేదు. చెల్లెలు తాను తప్పుచేశానని ఒప్పుకొని తన అపరాధానికి కాళ్ళమీద పడిఉంటే క్షమించి ఉండేవాడేమో. కాని దుర్గ తాను తప్పుచేసినట్లే భావించడంలేదు. భర్తతో సుఖంగాకూడా కాపురంచేస్తోంది. అది తనను ధిక్కరించినట్లు అనిపించింది అతనికి.

ఎంత ప్రయత్నించినా అన్న ఆదరం చూపకపోయేటప్పటికి దుర్గ తల్లిదండ్రులతో చెప్పుకు ఏడ్చింది. "సొంత చెల్లెలనైనా అభిమానం చూపలేకపోతున్నాడన్నయ్య. తాంబూలాలు పుచ్చుకున్న తరువాత ఎన్ని సంబంధాలు తిరిగి పోవడంలేదు. అదే అదేదో చేసి క్షమించరాని అపరాధమన్నమాట. జీవితమంతా సంబంధించిన విషయం. నచ్చని వాడిని కట్టుకొని ఏమి చేసుకోను? గొప్పవాళ్ళైతే కానచ్చును. కోటీశ్వరుడు గదా అని ముసలివాడిని పెళ్ళి చేసుకుంటారేమిటి. నేను సుఖంగానే ఉన్నాను. ఆయన నన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తున్నట్లు చూస్తారు. నాకింతకన్న ఏమీ అక్కర్లేదు. నాకు పెద్ద మేడలూ కారులూ, హోదాలూ అక్కర్లేదు. నే నతనిని చేసుకుంటే నేం అన్నయ్యకేమీ అడ్డు రాలేదుగదా. పైగా ఏ జీనిమిగిలేలు ఖర్చు తప్పలేదూ. అన్నయ్య ఎంతో ఆదరిస్తాడని, వెనకటిలాగానే సరదాగా ఉంటాడని పిల్లవాడిని చూస్తే ముచ్చటపడ్తాడని కొండంత ఆశతో వచ్చాను. ఆయన రానంటున్నా బలవంతాన లాగుకువచ్చాను. మేనసంబంధం విడదీయరాని దనుకున్నాను. కాని ఇలా జరిగింది."

తల్లీ తండ్రీ ఆమెను ఓదార్చారు. కాని వాళ్ళు ఏమీ చేయలేక పోతున్నారు. పొద్దున్న తీరికవేళ తల్లి వీరభద్రందగ్గరికి చేరి "ఏరా అబ్బాయి రాక రాక వచ్చింది. దాని నలా చూస్తే ఎలారా?" అంటుండగానే "ఇంకెలా చూడాలి. చేసినపనికి నెత్తిమీద ఎక్కించుకోవాలా?" అన్నాడు వీరభద్రం తీవ్రంగా.

"జరిగిపోయినదానికి ఇంకా పట్టుదల ఎందుకురా. అది చెల్లెలు కాకపోతుందా. నువ్వు అన్నవు కాకపోతావా. మన మనుకున్నట్లు చేస్తే ఎన్ని వేలై యుండేది?"

"ఏం ఇప్పుడూ ఇచ్చుకోండి. నాకేం అభ్యంతరంలేదు" అన్నాడు వీరభద్రం.

"అది డబ్బుకోసం ఆశపడడంలేదురా. కాస్త ప్రేమగా ఉంటే చాలుననుకుంటోంది. ఒక్కగానొక్క చెల్లెలిమీద ప్రేమ చూపించడంకూడా కష్టమేరా? అది ఒకటే ఇదిగా ఏడుస్తోంది నీకోసం" అంది తల్లి. వీరభద్రం ఏమీ మాట్లాడలేదు.

ఈ మాటలు చాటునుంచి వింటున్న దుర్గ కన్నీ రాపుకోలేకపోయింది. మోహనరావు వెంటనే ప్రయాణమై వెళ్ళిపోదామన్నాడు. అలాగే మర్నాడు ప్రొద్దున వెళ్దామంది దుర్గ. తల్లి, తండ్రితో చెప్పింది. వాళ్ళు ఇంకా ఉండమన్నారు. "అసలు పదిహేనురోజులేనా ఉందామనే వచ్చాము. కాని ఇక ఉండలేము. అన్నయ్యకు బాధగా ఉంటే ఈ యింట్లో ఎలా ఉండగలం?" అంది దుర్గ.

గౌరీనాథంగారు కొడుకుదగ్గర మూడు వందలరూపాయలుతీసుకొని బజారుకు వెళ్ళి చంటిపిల్లవాడికి బంగారుగొలుసూ, మురుగులూ, ఉంగరం. కూతురికోసం నాలుగు మంచిచీరలు, జాకెట్టుగుడ్డలు, అల్లుడికి సూటుగుడ్డలూ అన్నీ తెచ్చారు. కోడలిచేతే పెట్టించారు అన్నీ. వద్దంది దుర్గ. "తీసుకో అమ్మా. ఇవి తీసుకోకపోతే మరీ ఆగ్రహించవచ్చువాడు" అన్నారు గౌరీనాథంగారు.

సాయంత్రం అన్నగారితో చెప్పింది దుర్గ "అన్నయ్యా రేపు మేము వెళుతున్నాం" అని. వీరభద్రం మాట్లాడలేకదా. "మాటవరసకైనా ఉండమనలేదు అన్నయ్య. ఇంత శత్రువునై పోయాను నేను అన్నయ్యకి", అని కంట తడిపెట్టుకుంది దుర్గ. మర్నాడు పొద్దుటికి ప్రయాణం నిశ్చయించుకొని సన్నాహాలు చేస్తోంది.

ప్రొద్దున్న మహాలక్ష్మి భర్తకు జ్ఞాపకం చేసింది చెల్లెలూ వాళ్ళూ ఆవేళే వెళుతున్నట్లు. వీరభద్రం ఉలిక్కిపడ్డాడు. మనస్సు ఏదో విధంగా అయింది. మామూలుగా పేపరు చదువుదామనుకున్నాడు కాని చదవలేకపోయాడు. ఒకమూల వెనకటి ఘటనా, ఆనాటి అవమానం మనస్సులో నిలబడే వున్నాయి. ఏమీతోచక వీధిలోకి వెళ్ళిపోయాడు. ఉత్తరాది ముష్టివాళ్ళు ఎవరో వచ్చి దారికడ్డంగా నిలబడి పాటలు పాడుతున్నారు. అన్నా చెల్లెళ్ళు కాబోలు. అన్నగారు హార్మోని వాయిస్తున్నాడు. చెల్లెలు పాడుతోంది— హిందీ సినిమా పాటలు. పిల్లలువచ్చి చుట్టూ గుమిగూడి వింటున్నారు. వీరభద్రాన్ని చూసి ముష్టివాళ్ళిద్దరూ "భైయా కుచ్ ధరమ్ దో" అని వంగి సలాముచేశారు. వీరభద్రం ఆగిపోయి వాళ్ళకేసి ఒకనిమిషం చూసి వాళ్ళ చేతుల్లో ఒక పావలా కాసు పడేసి లోపలకు వచ్చాడు. మోహనరావు దగ్గరకు వచ్చాడు. "ఈ పూటే వెళ్ళిపోతున్నామండి. ఎప్పుడైనా మీరు కలకత్తా రండి," అన్నాడు. "చూస్తాను" అని ఊరుకున్నాడు వీరభద్రం.

అంతా భోజనాలకు కూర్చున్నారు. దుర్గ కన్నీళ్ళతో సరిగా భోజనం చేయలేకపోయింది. తల్లీ తండ్రీకూడా సగం సగంగా తిన్నారు. వీరభద్రం పరధ్యానంగా తిన్నాడు. భోజనాలయిన వెంటనే మోహనరావు బండి తీసుకువచ్చాడు. బండి మనిషి సామాను బండిలో పెట్టున్నాడు. వీరభద్రం లోపల గుమ్మందగ్గరే నిలబడిచూస్తున్నాడు. మోహనరావు "వెళ్తామండి. ఉత్తరాలు రాస్తూ ఉండండి." అని అన్నాడు దూరం నుంచే. వీరభద్రం తన గదిలోకి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. దుర్గ లోపలికి వచ్చింది. "వస్తాము అన్నయ్యా" అంటూ వంగి అన్నగారి పాదాలు స్పృశించింది. అతని పాదాల మీద రెండు నీటిబొట్లు పడ్డాయి. వీరభద్రం అదిరిపడ్డాడు. దుర్గ బయటికి నడిచింది. వీరభద్రం అలాగే కూర్చొని ఉండిపోయాడు. చేతులు పట్టుకొని తలవంచుకొని ఆలోచిస్తూ వుండగా కాళ్ళమీద రెండు నీటిబొట్లు పడ్డాయి తన కంట్లోనే. తనే ఆశ్చర్యపోయాడు వీరభద్రం. ఆ కన్నీటిబొట్లు తుడిచేశాడు. ఆ తుడవడంలో కుడిచేతి చూపుడు వేలుమీద ఉన్న చిన్న మచ్చ అతని దృష్టిలో పడింది. చటుక్కున ఏదో మెదిలింది అతని మనస్సులో. చిన్ననాడు తను పన్నెండేళ్ళవాడు దుర్గ ఐదేళ్ళ పిల్ల అయినప్పుడు ఒకనాడు ఆడుకొంటూండగా దుర్గ అతనిమీదికి కొలుజొమ్ము విసిరింది. అది అతని వేలుకుతగిలి నెత్తురు వచ్చింది. నెత్తురు చూసేటప్పటికి దుర్గ "అయ్యో దెబ్బ తగిలిందా అన్నయ్యా, ఏదీ మందువేస్తాను" అని ఆ వేలు నోట్లో పెట్టుకుంది. అతను నవ్వి తడిగుడ్డ కట్టుకున్నాడు. వేలికి కట్టుచూసి తల్లి అడిగి దుర్గ కొట్టిందని తెలిసి దానిని కొట్టబోయింది. వీరభద్రం అడ్డుపెట్టాడు. తరువాత అన్నం కలుపుకోవడం కష్టమైతే దుర్గ తన చిన్నచేతితో అతనికి కలిపిపెట్టబోయింది—అంతే ఈ ఆలోచన రాగానే అతనిలో పట్టుదల నిలబెట్టిన కట్టకు ఒక బెజ్జం పడింది. ఆ బెజ్జంలోనుంచే ఆర్ద్రస్మృతుల ప్రవాహం బయటికి వస్తూ క్షణంలోనే ఆ బెజ్జాన్ని పెద్ద గండిగాచేసి పొంగి, పొర్లి వచ్చేసింది. "అబ్బాయీ, అమ్మాయి వెళ్ళిపోతోందిరా" అని తండ్రి కేక విని వీరభద్రం కంగారుగా వీధిలోకి పరుగెత్తుకు వచ్చాడు. దుర్గ అప్పుడే బండిలోనికి ఎక్కబోతోంది. "ఆగు అమ్మాయి. మీరిప్పుడు వెళ్ళొద్దు. బండివాడిని నేను పంపించేస్తాను" అని చెల్లెలూ వాళ్ళను దింపించేసి బండివాడికి డబ్బులిచ్చి పంపేశాడు వీరభద్రం. ★